ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- డిసెంబర్ నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.

- ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలను కోరారు.

- గోదావరి పుష్కరాల సందర్భంగా 500 కోట్ల రూపాయలతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

- వాయుగుండం, రుతుపవన ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పంలో మూడవరోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా రైతులు, బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుప్పం అధికారులతో సమావేశమై నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని ప్రాంతాలు సమానంగా పురోగతి సాధించేలా కార్యాచరణ రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో క్వాంటం, సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు అత్యాధునిక విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు.

====================

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలను కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (సర్)లో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో పర్యటించిన రామ్మోహన్ నాయుడుకు ఎస్.ఐ.ఆర్ బి.ఎల్.వో ఎన్యూమరేషన్ పత్రాలను అందించారు. ఓటరు పేరు, ఫోటో, గుర్తింపు కార్డు నంబరు తదితర వివరాలను ఎన్యూమరేషన్ పత్రాలలో పొందుపరిచి సంతకాన్ని చేసి తిరిగి బి.ఎల్.వోకి అందచేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఓటర్ల సవరణ కార్యక్రమంలో కొత్తగా ఓటరు నమోదు, పేరు, వయస్సు, చిరునామా వివరాల్లో మార్పులు, సవరణలు చేయించుకోవచ్చని తెలిపారు. నకిలీ ఓట్లు నివారించడానికి.. డబుల్ ఓటింగ్ లేకుండా చేసేందుకు సర్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

====================

గోదావరి పుష్కరాలు సందర్భంగా నది ఒడ్డున వున్న ఆలయాలకు 500 కోట్ల రూపాయలతో మరమ్మతులు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా పెరుమూళ్ల పాడులోని నాగలింగేశ్వరస్వామి ఆలయం, చేజర్లలోని చెన్నకేశవ స్వామి ఆలయం, చిత్తలూరు గ్రామంలోని చెన్నకేశవ ఆలయాల అభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 62 ఆలయాల్లో నిత్యాన్నదానం చేస్తున్నామని వెల్లడించారు. నెలకు 24 లక్షల మందికి దేవాలయాల్లో అన్నదానం చేస్తున్నామన్నారు. 6 వేల 200 ఆలయాల్లో ధూప, దీప నైవేద్యం కింద నెలకు 10 వేల రూపాయలు ఇస్తున్నామని పేర్కొన్నారు.

====================

విశాఖపట్నం నుంచి చేపలవేటకు వెళ్లి సముద్రంలో గల్లంతయిన మత్స్యకారులను రక్షించేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కుప్పం నుంచి ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. గల్లంతైన వారిలో ఐదుగురి ఆచూకీని అధికారులు గుర్తించారు. గల్లంతైన మత్స్యకారుల్లో కారె చిన్నయ్యను సముద్రంలో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక సిబ్బంది గుర్తించి కాపాడారు. మిగిలిన జాలర్ల కోసం సముద్రంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు గల్లంతైన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని.. ఆందోళన చెందవద్దని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై స్పందించిన హోంమంత్రి వంగలపూడి అనిత కోస్టుగార్డ్ నౌకలతో గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

====================

విరామం

====================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో రేపు పర్యటించనున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్.. రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా.. వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ఈరోజు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మునికూడలి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మునికూడలి ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు సమీక్షించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో మునికూడలిని మోడల్ పుష్కర్ పంచాయతీగా, మొట్టమొదటి జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీగా అభివృద్ధి చేస్తున్నారు.

====================

పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. కావలిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఈరోజు ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. బాలికల భద్రత కోసం అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామనని, పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరిస్తుందని తెలిపారు.

====================

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో 3 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు మెరుగైన సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణంలో చదువుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పేదలు, గిరిజనులు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

====================

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి తప్పులులేని ఓటర్ల జాబితాను రూపొందించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.

భీమవరంలో బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ నాగరాణి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల వివరాలను ఒకే చోటకు పరిమితం చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడిని ఓటరుగా నమోదు చేయడానికి, ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించడం కోసం ప్రజలంతా సహకరించాలని కోరారు.

=====================

వాయువ్య బంగాళా ఖాతం, ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది బాలాసోర్‌కు 50 కిలోమీటర్లు దూరంలో కేంద్రీకృతమై ఉందని, పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రాబోయే 24 గంటల్లో తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే నైరుతి రుతుపవన ద్రోణి వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతోందని తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం వుందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వెల్లడిస్తూ…

(వాయిస్…22 సెకన్లు)

=====================

=====================